ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

ఆదివారం 14 ఏప్రిల్ 2024

విద్యాసంస్థల్లో వేడుకల హంగామా 8లో..

మాజీ స్పీకర్ శ్రీపాదరావుకు ఘన నివాళి 8లో..



జోరుగా జీరో మద్యం అమ్మకాలు

- పలుచోట్ల ఇతర రాష్ట్రాల మద్యం నిల్వలు
- సుల్తానాబాద్ కేంద్రంగా మద్యం కల్తీ
- గతంలోనే నమోదైన కేసులు
- అయినా ఆగని దందా..

సుల్తానాబాద్, ఏప్రిల్ 13: సుల్తానాబాద్‌లో జోరుగా జీరో మద్యం అమ్మకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కాట్నపల్లి వద్ద పట్టుబడిన జీరో మద్యం నిలువలు ఈ ఆరోపణలను బలపరుస్తున్నాయి. సుల్తానాబాద్ పట్టణంలో గతంలో కల్తీ మద్యం విక్రయాలు కూడా జోరుగా సాగాయి. ఈ మేరకు పలు కేసులు కూడా నమోదయ్యాయి. కొంత మంది మద్యం దుకాణాల యజమానులు ప్రత్యేకంగా కొందరిని నియమించుకుని కల్తీ మద్యం తయారు చేసేవారు. బ్రాండెడ్ మద్యం సీసాల మూతను చాకచక్యంగా తొలగించి చీప్ లిక్కర్‌ను నింపేవారు. మరికొందరు బ్రాండెడ్ సీసాల నుంచి కొంత మ ద్యం తొలగించి మిగతాది నీటిని నింపేవారు. ఈ దందాపై కొందరు ఫిర్యాదు చేయడంతో హైదరాబాద్‌లాంటి హైదరాబాద్ స్థాయి అధి కారులు దాడులు జరిపి స్థానిక మద్యం షాపుల్లో జరుగుతున్న కల్తీ దందా గుట్టు రట్టు చేశారు. ఒక్కో మద్యం దుకాణంలో కల్తీ చేయడానికి ఇతర ప్రాంతాల నుంచి ఎక్స్‌పర్ట్‌లను కూడా రప్పించారని వెలుగు చూసింది.

● వీడని మద్యం కేసు మిస్టరీ..

ఈనెల 9న కాట్నపల్లి వద్దగల పాత గోదాములో అధికారులు పట్టుకున్న మద్యం నిల్వలకు సంబంధించిన మిస్టరీ ఇప్పటికి వీడడం లేదు. ఈ మద్యంను ఎవరు, ఎప్పుడు అక్కడ నిలువ చేసి ఉంచారనే విషయాన్ని అధికారులు తేల్చడం లేదు. గోదాము ఎవరి అజమాయిషీలో ఉందో వారిని పిలిపించి మాట్లాడిన అధికారులు ఇందుకు బాధ్యులు ఎవరనే విషయాన్ని బహిర్గతం చేయడం లేదు. ఇప్పటికైనా అసలు దోషులు ఎవరనే విషయాన్ని బయటపెట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

● పర్యవేక్షణ లోపం.. కల్తీకి ఆస్కారం..

ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో సుల్తానాబాద్ పట్టణంలో మద్యం వ్యాపారుల దందా యథేచ్ఛగా సాగింది. గత ప్రభుత్వ హయాంలో కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకులు కూడా మద్యం వ్యాపారంలో ఉండడంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు.



పట్టుకున్న మద్యం పెట్టెలను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

● జీరో మద్యం అమ్మకాలు

కల్తీ మద్యం విక్రయాలతో పాటు జీరో మద్యం అమ్మకాలు కూడా కొనసాగుతున్నాయని వారంరోజుల కిందట లభ్యమైన ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం నిల్వల గుట్టు రట్టుతో తెలు స్తోంది. సుల్తానాబాద్ శివారులోని కాట్నపల్లి డాబా ఎదురుగా ఉన్న ఓ పాత గోదాములో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 90 పె ట్టెల మద్యం పట్టుబడింది. కొంత మంది వ్యాపారులు కొంత కాలంగా ఈ జీరో మద్యం వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని తెలుస్తోంది.

మినీ స్టేడియం అభివృద్ధికి కృషి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఏప్రిల్ 13: సుల్తానాబాద్ పట్టణంలోని మినీస్టేడియం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా జిల్లాకు మంజూరైన ఖోఖో శిక్షణ కేంద్రాన్ని ఆయన శనివారం సాయంత్రం సందర్శించారు. గత కొన్ని రోజులుగా ఇక్కడ ఖోఖో క్రీడలో శిక్షణ పొందుతున్న బాలబాలికలతో మాట్లాడారు. వారికి శుభాకాంక్షలు తెలుపుతూ క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడల వలన కలిగే ప్రయోజనాల గురించి వారికి వివరించారు. ఖోఖో కోచ్ గెల్లు మధూకర్ ఈ సందర్భంగా ఈ కేంద్రంలో నిర్వహించే శిక్షణ గురించి ఎమ్మెల్యేకు వివరించారు. పలువురు ఇక్కడ సౌకర్యాల లేమి గురించి ఆయన దృష్టికి తేగా పార్లమెంట్ ఎన్నికల అనంతరం మినీ స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. క్రీడల నిర్వహణకు అనుగుణంగా క్రీడాకారులు శిక్షణ పొందడానికి అనుకూలంగా మినీ స్టేడియంను తీర్చిదిద్దుకుందామని అన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. తొలుత ఆయన పెరికి గిద్ద అంజనేయస్వామి ఆలయం వెనుక ఉన్న గోశాలను సందర్శించారు. గోశాల నిర్వాహకులు తాము ఎదురుకుంటున్న పలు సమస్యలను ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించారు.

బీపీ మండల్ పోరాటాలు స్ఫూర్తిదాయకం..

- జడ్పీ చైర్మన్ పుట్ట మధు



బీపీ మండల్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పుట్ట మధు

మంథని, ఏప్రిల్ 13: దేశంలో అత్యధికులుగా ఉన్న బీసీ సమాజ హితం బీపీ మండల్ చేసిన పోరాటాలు అందరికి స్ఫూర్తిదాయకమని జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు స్పష్టం చేశారు. బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి చిత్రపటానికి పూల మాలలు వేసి పుట్ట మధు, బీఆర్ఎస్ శ్రేణులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ.. బీసీ కమిషన్ చైర్మన్‌గా బీసీ సమాజ హితం కోసం పోరాటం చేసిన బీపీ మండల్ మహనీయుడని కొనియాడారు. బీపీ మండల్ స్ఫూర్తితో బీసీల జనాభా శాతం ప్రకారం రిజర్వేషన్లు సాధించడానికి బీసీలంతా ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

జడ్పీ చైర్మన్‌కు నోటీసులు

మంథని, ఏప్రిల్ 13: జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జి పుట్ట మధుకు పోలీసులు శనివారం నోటీసులు జారీచేశారు. ఇటీవల సాగు నీరు లేక ఎండిన పంటలకు నష్టపరిహారం అందించాలని, వరి పంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలని పుట్ట మధు అంబేద్కర్‌చౌక్‌లో రైతుల పక్షాన నిరసన దీక్ష చేపట్టారు. దీక్షకు ముందస్తు అనుమతిలేని కారణంగా ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించిన తీరుపై మంథని పోలీసులు పుట్ట మధుతోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేశారు.

క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో విధులు నిర్వహించాలి : సీపీ

కోల్‌సిటీ, ఏప్రిల్ 13: క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో విధులు నిర్వహించాలని రామగుండం సీపీ అన్నారు. పోలీస్ కమిషనరేట్ నుంచి తమిళనాడు సాధారణ ఎన్నికల సందర్భంగా డ్యూటీపై వెళ్తున్న 64 మంది హోంగార్డ్ ఆఫీసర్స్‌కు ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల విధులు, నిబంధనలపై నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో విధులు నిర్వహించాలని సూచించారు. స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఎక్కడ ఉన్నది తెలుసుకొని, వారితో సమాచార సంబంధాలను కలిగి ఉండాలని, బందోబస్తులోని ఒక విభాగం మొబైల్ పార్టీగా నిర్దేశించబడి ఉంటుందని, తమకు ఇవ్వబడిన పరిధిలో పెట్రోలింగ్ చేస్తూ అసాంఘిక సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్యూటీకి వెళ్తున్న సిబ్బందికి అత్యవసరమైన మెడిసన్ కిట్స్, మాస్కిటో నెట్స్, కాయిల్స్ అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సురేంద్ర, ఆర్ఐ హోంగార్డ్స్ మల్లేషం, ఆర్ఎస్ఐ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రభుత్వ విప్ పూజలు

ధర్మారం, ఏప్రిల్ 13: మండలంలోని దొంగతుర్తి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయంలో ఆయనకు అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనను సన్మానించి తీర్థ ప్రసాదం అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కోడారి హన్మయ్య తదితరులు ఉన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడికి సన్మానం

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 13: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్‌ను శనివారంరాత్రి 11వ డివిజన్ సంజయ్‌నగర్ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాతంగి రాయమల్లు, లింగయ్య, వెంకటస్వామి, దరిపెల్లి లక్ష్మి, రామిల్ల సునీత, మాతంగి రాజేశ్వరి, స్వరూప, అమృతమ్మ, రాజేశ్వరి, గడ్డం శంకర్, పులిపాక రవీందర్, కాసిపేట స్వామి, ఈర్ల ఓదెలు, రవికుమార్, రాయపోషం పాల్గొన్నారు.

వైభవంగా శ్రీమహాలక్ష్మి ఆలయంలో శ్రీచక్ర ప్రతిష్ఠాపన

మంథని, ఏప్రిల్ 13: స్థానిక శ్రీమహాలక్ష్మి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో శ్రీచక్ర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వేదోక్తంగా పండితులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళ భక్తులు శ్రీలలితా సహస్ర నామాల పారాయణం చేశారు. భక్తులకు అన్న ప్రసాదాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీతారాముల మహోత్సవాలు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 13: మండల కేంద్రంలోని శ్రీ జగత్ మహామునీశ్వర స్వామి ఆలయంలో ఈనెల 14నుంచి 18వరకు శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు బసవత్తుల రాజమౌళి ఆచార్యులు తెలిపారు. ఐదు రోజులు ఆలయంలో ప్రత్యేక పూజా, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించి 18న శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం జరుగుతుందని, భక్తులు హాజరుకావాలని కోరారు.

టీడీపీకి రాజీనామా

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 13: తెలుగుదేశం పార్టీకి సీనియర్ నాయకుడు అనుమ రాజమల్లు తన క్రియాశీలక సభ్యత్వానికి, రాష్ట్ర కార్యదర్శి పదవులకు రాజీనామాచేశారు. ఈమేరకు శనివారం రాజీనామా లేఖను పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుకు పంపించారు. నలభై ఏళ్ళుగా పార్టీకి సేవలందించానని, ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయకపోవడం, త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండటం బాధాకరమని, తన రాజీనామాను ఆమోదించాలని రాజమల్లు కోరారు.

'శ్రీపాద' స్ఫూర్తితో ప్రజాసేవ..

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



శ్రీపాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీధర్‌బాబు

మంథని, ఏప్రిల్ 13: అందరికి సేవ చేయాలని, కనీస సౌకర్యాలను ప్రజలకు అందించాలని జీవితాంతం తపన పడిన తన తండ్రి మాజీ శాసన సభా స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు స్ఫూర్తితో ప్రజాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాజకీయాల్లో పని చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. స్థానిక శివకిరణ్ గార్డెన్స్ మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యేలు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, గడ్డం వివేక్, వినోద్, ప్రేమ్ సాగర్‌రావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీ, కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు శనివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మనందరికి ఆత్మీయుడైన స్వర్గీయ కాక వెంకటస్వామి మనువడు గడ్డం వంశీని కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా ఆదరించి రానున్న ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం తమ కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురి చేసిందన్నారు. వారిలాగ ఇతర పార్టీల వారిని ఇబ్బందులకు గురిచేయడం కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. అధికారానికి దూరంగా ఉన్న పది సంవత్సరాలపాటు తనతో పాటు ఉన్న ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ, తన కుటుంబ సభ్యులే అన్నారు. మనసా వాచా కర్మేనా తన శాయశక్తులా తనతో ఉన్నవారికి పని చేస్తామన్నారు. తన తండ్రి శ్రీపాదరావు ఆశయాలను కొనసాగిస్తూ మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లి మంచి పేరు తీసుకు వస్తామన్నారు. అభివద్ధే, సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే కాంగ్రెస్ శ్రేణుల లక్ష్యాన్ని ఎవరు ఆపలేరన్నారు. అధికారంలో ఉండగా మర్డర్‌లు చేసిన వాళ్లు రోడ్లపైనే తిరుగుతున్నారని ఆరోపించారు. అనంతరం పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. రాజకీయాల్లో అజాత శత్రువుగా పేరుగాంచిన మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు భౌతికంగా దూరమై 25 ఏళ్లు గడిచినా ఇంకా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లిలో గడ్డం వంశీని గెలిపించడానికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సీపీఐ నేతలు

ఇసుక టెండర్లను రద్దు చేయకుంటే ఆందోళన ఉధృతం

సుల్తానాబాద్, ఏప్రిల్ 13: సుల్తానాబాద్ ప్రాంత మానేరు పరివాహక గ్రామాల నుంచి ఇసుకను తరలించేందుకు ప్రభుత్వం నిర్వహించిన టెండర్లను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. గట్టేపల్లి గ్రామంలో కొనసాగుతున్న నిరాహారా దీక్షలకు శనివారం సీపీఐ నేతలు సంఘీభావం తెలుపుతూ దీక్షలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి సదానందం మాట్లాడుతూ టెండర్లు రద్దు చేయకపోతే తమ అందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోడం స్వామి, ఉదయ్, రమేష్, సదానందం, అంజిరాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులను ఆదుకునేందుకు చర్యలు : ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 13: రామగుండం నియోజకవర్గంలోని గంగపుత్రులను అన్ని విధాలా ఆదుకుంటానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. శనివారం తిలక్‌నగర్‌లోని గంగపుత్ర సంఘం కార్యాలయంలో నియోజకవర్గ ఫిషరీస్ చైర్మన్ పల్లికొండ రాజేష్ ఆధ్వర్యంలో గంగపుత్ర సంఘం బాధ్యులు బంగారి రాజయ్యపారిపెల్లి రాయలింగం, సాంబమూర్తి, ఈశ్వర్, సదానందం తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ గతంలో తాను అధికారంలో లేకున్నా 40గ్రామాల గంగపుత్ర కుంటాలకు సొసైటీలు చేయించానని, వారి సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సుజాత పాల్గొన్నారు.

సమస్యలను అధికారుల దృష్టికి తేవాలి



పారిశుధ్య పర్యవేక్షకులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ, ఏప్రిల్ 13:రామగుండం నగరపాలక సంస్థ పారిశుధ్య పర్యవేక్షకులు ప్లాస్టిక్ నిషేధం అమలు, కుక్కల బెడద, నీటి సరఫరా, పైప్‌లైన్ లీకేజీలు, వీధి దీపాలు, అక్రమ నిర్మాణాలు, తదితర సమస్యలను ఆయాశాఖల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించడంలో ప్రధాన పాత్ర పోషించాలని రామగుండం కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ కోరారు. శనివారం పారిశుధ్య పర్యవేక్షకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమర్థవంతంగా పారిశుధ్య చేయాలన్నారు. మల్లికార్జున్‌నగర్‌లోని పెద్ద కాలువలో జరుగుతున్న పూడిక తొలగింపు, కోదండ రామాయలంలో లెవలింగ్ పనులను కమిషనర్ పరిశీలించారు. ఆయన వెంట డీసీ త్రియంబకేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 13: పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లతోపాటు సంక్షేమ రంగానికి సంబంధించిన మెస్ బిల్లుతో పాటు డైట్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం లోని ఓ డిగ్రీకళాశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాజన్న సిరిసిల్ల జిల్లా మూడో మహాసభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జెండాను జిల్లా అధ్యక్షుడు మంద అనిల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లతోపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టల్‌లకు సంబంధించిన డైట్ చార్జీలు విడుదల చేయకపోవడం సరికాదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలను మూడువేల రూపాయలకు పెంచాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రి లేకపోతే సమస్యలపై ఏవిధంగా చర్చిస్తారన్నారు. పెండింగ్‌లో ఉన్న 7,800కోట్ల రూపాయల స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయడంతోపాటు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్, రాకేష్, సహాయ కార్యదర్శి కళ్యాణ్, అనూష తదితరులు పాల్గొన్నారు.






ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం

అపర భద్రాద్రికి బ్రహ్మోత్సవ శోభ

- సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం
- రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు సమర్పించనున్న కలెక్టర్ పమేలా సత్పతి
- రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

ఇల్లందకుంట, ఏప్రిల్ 13: మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి 27వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 17న శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆలయ చరిత్ర రామాయణంతో ముడిపడి ఉంది. త్రేతాయుగంలో రాముడు, లక్ష్మణుడు, సీతా అరణ్య వాసం చేస్తూ ఇక్కడ సేద తీరుతన్న సమ యంలో తన తండ్రి దశరథ మహరాజు మరణ వార్త తెలిసింది. ఇక్కడి ఇల్లంద వృక్షం పలుకులతో శ్రీరాముడు తన తండ్రికి శ్రాద్ధకర్మలు జరిపించారని ఆలయ పూజారులు చెబుతారు. అప్పటి నుంచి ఈ గ్రామానికి ఇల్లందకుంట అని పేరు పెట్టారు. ఇల్లందకుంట ఆలయంలో సీతారామచంద్రులను పుట్టు దేవుడిగా అభివర్ణిస్తారు. ఆలయ ఉత్సవ మూర్తులకు పుట్టు మచ్చలు ఉండడం ఇక్కడి ప్రత్యేకత. రాముడు అరణ్యవాసంలో భాగంగా ఇక్కడ 13 రోజులు ఈ పరిసర గ్రామాల్లో సంతరించాడని పెద్దలు చెబుతారు. అందుకే ఈ గ్రామాల పేరు లక్ష్మాజిపల్లె, శ్రీరాములపల్లె, సీతంపేట, సిరిసేడు, లక్ష్మన్నపల్లెగా ఉన్నాయి. ఈ నెల 15నుంచి 27వరకు జరగనున్న బ్రహ్మో త్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగ కుండా కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మొహంతి, దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఆలయ కార్యానిర్వాహణాధికారి కందుల సుధాకర్ పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేశారు. హుజూ రాబాద్ ఆర్డీవో రమేష్‌బాబు, ఏసీపీ శ్రీనివాస్‌జీలు స్థానిక అధికారులచే సమీక్ష సమావేశాలు నిర్వహించారు.


శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులు

లక్షలాదిగా తరలిరానున్న భక్తులు

బ్రహ్మోత్సవాలకు సుమారు లక్షకుపైగా భక్తులు హాజరు కానున్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు (శ్రీరామనవమి రోజు) జమ్మికుంట కాటన్, రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వైద్య సదుపాయం అందించేందుకు 108, 104 వాహనాలను అందుబాటులో ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ శ్రీనివాస్‌జీ, జమ్మికుంట రూరల్ సీఐ కోరె కిశోర్, ఎస్‌ఐ రాజకుమార్‌ల భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. ఆలయ పరిసరాల్లో 18 సీసీ కెమెరాలు అమర్చారు.

భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం.

- కందుల సుధాకర్, ఆలయ ఈవో, ఇల్లందకుంట



దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. సీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి.

బ్రహ్మోత్సవాల వివరాలు

- 15న సోమవారం రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తుల బాహ్యామందిర ప్రవేశం
- 16న మంగళవారం సాయంత్రం 6 గంటలకు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ
- 17న బుధవారం ఉదయం 9గంటలకు ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ట, ఉదయం 10 గంటలకు ఎదుర్కోళ్లు, మధ్యాహ్నం 12 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం, రాత్రి 9 గంటలకు శేషవాహన సేవ
- 18న గురువారం ఉదయం 10 గంటలకు పట్టాభిషేకం, సువర్ణ పుష్పార్చన, సాయంత్రం 6 గంటలకు ప్రభుత్సోత్సవం ప్రారంభం
- 19న శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ప్రభుత్సోత్సవం, రాత్రి 9 గంటలకు గరుడవాహన సేవ
- 20న శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రభుత్సోత్సవం, రాత్రి 9 గంటలకు హనుమత్ వాహన సేవ
- 21న ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రభుత్సోత్సవం, రాత్రి 9 గంటలకు గజవాహన సేవ, అనంతరం సదస్యం, వేదాశీర్వచనం.
- 22న సోమవారం సాయంత్రం 6 గంటలకు ప్రభుత్సోత్సవం ముగింపు, రాత్రి 9 గంటలకు అశ్వవాహన సేవ, దోపోత్సవం.
- 23న మంగళవారం సాయంత్రం 6 గంటలకు శకటోత్సవం, రాత్రి 7గంటలకు సూర్య రథోత్సవం (చిన్నరథం)
- 24న బుధవారం సాయంత్రం 7గంటలకు స్వామివారు చంద్రరథోత్సవం (పెద్దరథం) మీదకు వస్తారు.
- 25న గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తులకు స్వామివార్ల దర్శనం, సేవల అనంతరం తిరుమాడ వీధుల్లో చంద్రరోథత్సవం (పెద్దరథం) ఊరేగింపు. రాత్రి 7గంటలకు మహాపూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ
- 26న శుక్రవారం ఉదయం 9గంటలకు అష్టోత్తరశత (108) కలశాభిషేకం, అవబృథ చక్రస్నానం. రాత్రి 9గంటలకు ద్వాదశారాధన, శ్రీపుష్పయాగం (నాఖబలి)
- 27న శనివారం రాత్రి 7గంటలకు సప్త వరణాలు, ఏకాంతసేవ

గంజాయిపై ఉక్కుపాదం

- ఐదుగురు విక్రయదారుల అరెస్టు
- రెండు కిలోల గంజాయి సీజ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ



మాట్లాడుతున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 13: గంజాయి రవాణా, వినియో గంపై గట్టి నిఘా ఏర్పాటు చేశామని వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి అన్నారు. వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాల యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. వేములవాడ పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఐదురుగురిని అరెస్టు చేసి వారి వద్దనుంచి రెండు కి లోల గంజాయిని స్వాధీనపరచుకుని సీజ్ చేశామన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్యామ్ దివాకర్, వేములవాడ పట్టణానికి చెందిన మల్లికార్జున్, కామారెడ్డికి చెందిన కట్కూరి భాను, మంచిర్యాలకు చెందిన పరికిపండ్ల అన్వేష్ అలియాస్ బన్ని, వేములవాడ పట్టణం సుభాష్‌నగర్‌కు చెందిన మర్రిపల్లి సురేష్ అనే విక్రయదారుల నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న మరికొందరు పరారీలో ఉన్నారని వారిని కూడా త్వరలో పట్టుకుంటామని తెలి పారు. గంజాయి మహమ్మారిని తరమికొట్టడంలో భాగంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వేములవాడ ప్రాంతంలో గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలు సహకరిం చాలన్నారు. గంజాయి విక్రయించినట్లు తెలిసినా, గంజాయి ని సేవిస్తున్నట్లు తెలిసినా పోలీసులకు సమా చారం అం దించాలని లేదా 100కు డయల్ చేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంలో చురుకుగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు రాజశేఖర్, తిరుపతి, శంకర్, గోపాల్, సతీష్‌లకు డీఎస్పీ నాగేంద్రచారి రివా ర్డులను అందజేసి అభినందించారు. సమావేశంలో రూరల్, పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్సై మారుతి, టౌన్ ఎస్సై అంజ య్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కౌన్సిల్ సభ్యుల తనిఖీలు

- 8 క్లినిక్‌లపై కేసులు


నిర్వాహకుడిని వివరాలను అడుగుతున్న డాక్టర్ సురేష్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 13: తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ బృందం వైద్యులు డాక్టర్ సరేష్, డాక్టర్ రితేష్, డాక్టర్ గౌతం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో పలు క్లినిక్‌లపై ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. చాలా చోట్ల అనుమతులు లేకుండా ఆర్‌పీలు డాక్టర్లమంటూ ప్రచారం చేసుకుంటూ వైద్యం చేస్తున్నారని వారి తనిఖీల్లో తేలింది. కొందరు బెడ్లు కూడా ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నట్లు తనిఖీ బృందం గుర్తించింది. జిల్లా కేంద్రంలోని గోదాంగడ్డలోని వేంకటేశ్వర వైద్యాలయం, హెవెన్లీ క్లినిక్, హెల్త్‌కేర్ క్లినిక్, రాంనగర్‌లోని లక్ష్మి, సాయిరాం, కావ్య క్లినిక్‌లతో పాటు అర్చి క్లినిక్, సాయిరాం, లలిత పాలి సెంటర్లను తనిఖీ చేశారు. ఇందులో అర్చి క్లినిక్ మినహా మిగతా క్లినిక్‌లన్నీ అర్హత లేకుండా నిర్వహిస్తున్నారని, వారిపై కేసు నమోదు చేసినట్లు డాక్టర్ నరేష్ తెలిపారు. చింతకుంట క్రాస్ రోడ్‌లోని సాయిరాం నర్సింగ్ హోం, లలిత పాలీ సెంటర్, అర్చి క్లినిక్‌లలో అర్హత గల డాక్టర్లు ఉన్నప్పటికీ నర్సింగ్ హోం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి అనుమతులు తీసుకోకపోవడంతో వాటికి అనుమతులు తీసుకోవాలని నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. మిగతా క్లినిక్‌ల నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు వారు తెలియచేశారు. అర్హత లేకున్నా యాంటిబయాటిక్స్ మందులు రాస్తున్నారని, స్టెరాయిడ్స్ ఇస్తు న్నట్లు తమ తనిఖీల్లో తేలిందన్నారు.

వంతెన నిర్మాణ సామగ్రి చోరీ

ముత్తారం, ఏప్రిల్ 13: మండలంలోని ఓడేడు గ్రామ శివారులోని మానేరుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ సామగ్రి చోరీ జరిగినట్లు సైట్ ఇన్‌చార్జి సయ్యద్ బాబా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, ఏప్రిల్ 13: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం సుదూర ప్రాంతాలకు చెందిన అనేక మంది భక్తులు క్షేత్రానికి తరలి వచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకు న్నారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చర ణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వ హించారు. ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సీతారామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు

వేములవాడ, ఏప్రిల్ 13: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో రాజరాజేశ్వర స్వామి, సీతారామ చంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించా రు. శ్రీరామనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం ఉద యం రాజరాజేశ్వర స్వామివారి కి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రా భిషేకం, సీతారామ చంద్ర స్వామి వారికి పంచోపనిషత్ ద్వారాభిషేకం, పరివార దేవతార్చనలు నిర్వ హించారు. ఉత్సవాలలో భాగంగా సాయంత్రం వేళ లక్ష్మీఅనంతపద్మనాభస్వామి, పార్వతీ రాజరాజేశ్వరస్వావి వార్లను పెద్ద సేవపై ఊరేగించాల్సి ఉండగా, వాతావర ణం అనుకూలంగా లేని కారణంగా పెద్ద సేవను రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు.


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గోదావరిలో దూకి యువతి ఆత్మహత్య

య్జైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 13: గోదావరిఖనికి చెందిన ఆర్షియా అనే యువతి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. బాపూజీనగర్‌కు ఆర్టీసీ ఉద్యోగి అబ్దుల్లా కుమార్తె ఆర్షియా కుటుంబ సమస్యలు, ఆర్థికపరమైన ఇబ్బందులతో శుక్రవారం రాత్రి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అబ్దుల్లా కుమారుడు నిస్సార్ 2020 అక్టోబరులో గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

రెండు కార్లు ఢీ.. ఇద్దరి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు

వనస్థలిపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అతివేగం ఇద్దరి ప్రాణా లను బలితీసుకుంది. నిద్రమత్తులో అతివేగంగా కారు నడిపి డివైడ ర్‌ను ఢీకొని ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయా లయ్యాయి. ఈ ప్రమాదం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన బొల్లం ప్రణయ్‌కుమార్(29) ప్రైవేట్ ఉద్యోగి. మీర్‌పేట్‌లోని నందిహిల్స్‌లో ఉంటున్నాడు. ప్రకాశం జిల్లా సంతనూతల మండలం గుడిపాడు గ్రామానికి చెందిన కుంచాల రవీందర్‌బాబు(29) ప్రైవేట్ జాబ్ చేసుకుంటూ వనస్థలిపురం ఎస్‌కేడీ నగర్‌లో ఉంటున్నాడు. వీరి ద్దరూ స్నేహితులు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి 2.30 గంట లకు స్విఫ్ట్ కారు(టీఎస్22టీఏ 0898)లో తుర్కయాంజాల్ నుంచి బీఎన్‌రెడ్డినగర్‌కు వస్తున్నారు. అదేసమయంలో నల్గొండ జిల్లా మల్లేపల్లి సమీపంలోని వడ్డెమోనిగూడెం తండాకు చెందిన ఇస్లావ త్ దస్రు(26)తన క్రేటా కారు(టీఎస్05ఈసీ0123)తో బీఎన్‌రెడ్డినగర్ నుంచి తుర్కయంజాల్ వైపు వెళ్తున్నాడు. గుర్రంగూడ చౌరస్తా దాటిన తర్వాత నిద్రమత్తులో అతివేగంతో డివైడర్‌ని ఢీకొని అవతలి వైపు నుంచి వస్తున్న స్విఫ్ట్ కారును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో స్విఫ్ట్ కారు లోని బొల్లం ప్రణయ్ కుమార్, కుం చా ల రవీందర్ బాబు తీవ్రంగా గాయపడ్డా రు. సంఘటనా స్థలంలోనే ఇద్దరూ మృ తి చెందారు. ఇస్లావత్ దస్రుకు తీవ్ర గా యాలు కాగా అతడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తర లించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ప్రణయ్‌కుమార్(ఫైల్)

బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో మరొకరు..

అంతర్గాం: రామగుండం కార్పొరేషన్ పరిధి 20వ డివిజన్ ఏరి యా మల్యాలపల్లి వద్ద రాజీవ్ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చొప్పరి ఓదెలు(41) అనే విలేకరి మృతిచెందాడు. రామగుండం ఎస్సై కే సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. పాలకుర్తి మండలం బసంత్‌నగర్ కుర్మపల్లికి చెందిన ఓదెలు తన ద్విచక్ర వాహనంపై గోదావరిఖని వస్తున్నాడు. భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (టీఎస్28జెడ్0105) వెనుక నుంచి ఢీకొట్టగా ఓదెలు అక్కడికక్కడే మృతిచెందాడు. ఓదెలుకు భార్య స్వరూప, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓదెలు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సతీష్ తెలిపారు.


ఖనిలో నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్


కాలనీలో నివాళులు అర్పిస్తున్న నాయకులు


సుల్తానాబాద్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

మాజీ స్పీకర్ శ్రీపాదరావుకు ఘన నివాళి

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 13: మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతి శనివారం గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక ప్రధానచౌరస్తాలో శ్రీపాదరావు వర్ధంతి జరిగింది. ఈ కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావు, నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీపాదరావు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, వివేక్, వినోద్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ మహంకాళి స్వామి, టీపీసీసీ కార్యదర్శి కాల్వ లింగస్వామి, కాంగ్రెస్ దాని అనుబంధ సంఘాల నాయకులు జనక్‌ప్రసాద్, నాయిని ఓదెలు, బొమ్మక శైలజరాజేష్, గుమ్మడి రవి, తాళ్లపెల్లి యుగేందర్, యాకూబ్, ఫజల్ బేగ్, కోటేశ్వర్, కళ్యాణి సింహాచలం, కొప్పుల శంకర్, ముస్తఫా, గట్ల రమేష్, ఉమాదేవి, సాంబమూర్తి, నర్సింహారెడ్డి, ధర్మపురి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతినగర్ : దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతిని శనివారం ఎన్టీపీసీలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలని వెంకట్‌రెడ్డి, ముషిపట్ల సాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సాయి సేవా సమితిలో శ్రీపాదరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 200 మందికి అన్నదానం చేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి దుద్దిళ్ల శ్రీపాదరావు ఎంతో కృషి చేశారని నాయకులు ఈ సందర్భంగా కొనియాడారు. శ్రీపాదరావు ఆశయసాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రం, జిల్లా అభివృద్ధి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎంతో శ్రమిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, నంద కుమార్, బయ్యపు అశోక్‌రెడ్డి, నర్సయ్యగౌడ్, రహీం తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులు అర్పించాయి కాంగ్రెస్ శ్రేణులు. పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడారు. మంథని వంటి మారుమూల ప్రాంతం నుండి రాష్ట్ర రాజకీయాల్లో కీలకనేతగా ఎదగిని శ్రీపాదరావు, ఈప్రాంత ప్రజల మనస్సులో శాశ్వతంగా నిలిచి పోతారని అన్నారు. శ్రీపాదరావుని ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మారెల్లి రాజిరెడ్డి, శంకర్‌నాయక్, సాగంటి శంకర్, అక్బర్ అలీ, చాట్ల సదానందం, దామోదర్‌రావు, కేశవులు, చక్రపాణి, తిరుపతిరెడ్డి, వై తిరుపతి, అనుము రాములు, సారయ్యనాయక్, శనిగరం తిరుపతి, అవినాష్, సునీతసాంబయ్య, కండె రవి, మార్కండేయ, రాజేశంతో పాటు అనుబంధ సంఘా ల నాయకులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ..

శ్రీపాదరావు వర్ధంతిని పురస్కరించుకుని 15వ డివిజన్ కార్పొరేటర్ బదావత్ శంకర్‌నాయక్ మహిళా పారిశుధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. 15వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, వివేక్ వెంకటస్వామి, ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీల చేతల మీదుగా చీరలను పంపిణీ చేశారు.

అన్నదానం..

శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకుడు జక్కుల దామోదర్‌రావు అన్నదానం చేశారు. బేస్‌వర్క్‌షాప్‌లో లంచ్ విరామంలో జరిగిన కార్యక్రమాన్ని జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు అక్బర్ అలీ ప్రారంభించి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గుండేటి రాజేష్, మోహన్‌రావు, కిషన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కండె రవి, సారయ్య నాయక్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్‌గా పని చేసి ఆ పదవికి వన్నె తెచ్చిన దుద్దిళ్ల శ్రీపాదారవు ఆశయాల సాధనకు ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని నెహ్రూ చౌరస్తా వద్ద దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించి ఆయన చిత్ర పటానికి ఎమ్మెల్యే విజయరమణారావు పూలమాలలు వేసి అయన సేవలను కొనియాడుతూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు పెద్దపల్లి ప్రాంత అభివృద్ధిలో కూడా శ్రీపాదరావు పాత్ర మర్చిపోలేనిదన్నారు. స్పీకర్‌గా గొప్పగా సభను నిర్వహించిన తీరు ఆదర్శంగా ఉందన్నారు. సుల్తానాబాద్ పట్టణానికి శ్రీపాదరావుకు ఉన్న అనుభందం విడదీయలేనిదని గుర్తుచేస్తూ గత జ్ఞాపకాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు

రామగిరి : ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర మాజీ స్పీకర్ స్వర్గీయా శ్రీపాదరావు వర్ధంతిని కాంగ్రెస్ శ్రేణులు శనివారం ఘన నివాళి అర్పించారు. స్థానిక ఐఎన్‌టీయుసీ కార్యాయలంలో ఏర్పాటు చేసిన శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు మంథని ప్రాంతానికి చేసిన అభివృద్ధి, సేవాలను గుర్తు చేసుకున్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రొడ్డ బాపన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి నాయకులు తోటచంద్రయ్య, కాటంసత్యం, కొట రవీందర్‌రెడ్డి ఎంపీటీసీ చిందంమహేష్, తులసిరాంగౌడ్, తీగల సమ్మయ్య, ఎల్లైరాంమూర్తి, రాజ్‌కుమార్, శంకర్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం : మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం, అడవిశ్రీరాంపూర్ ఎంపీటీసీ దొడ్డ గీతారాణి బాలాజీ, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు వాజిద్‌పాషా, గాదం శ్రీనివాస్, కోళ్ల విజయ్, తీగల సత్యనారాయణ, దాసరి చంద్రమౌళి, గోవిందుల ఆనందు, బియ్యాని శివకుమార్, బక్కతట్ల కుమార్, తాళ్లపెల్లి విష్ణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు : మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో శనివారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ కాంగ్రెస్ పార్టీ నేత దుద్దిళ్ల శ్రీపాదరావు 25వ వర్ధంతి వేడకలు నిర్వహించారు. ఆయన చిత్రపఠానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, నాయకులు గోదల శ్రీనివాస్‌రెడ్డి, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, తాటిపల్లి రమేష్‌బాబు, కొప్పుర తిరుమల్‌రెడ్డి, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, పడాల పర్శరాంగౌడ్, బూర్లవెంకటసత్యం, పెద్దపల్లి దేవరాజ్, అమ్ముల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతి కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ శ్రీపాదరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు స్పీకర్‌గా అందరి మన్ననలు పొందడమే కాకుండా మారుమూల మంథని నియోజకవర్గంతో పాటు రాష్ట్రం నలుమూలలా అభివృద్ధికి కృషి చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఇప్పటి యువత వారి అడుగుజాడల్లో నడిచి వారి ఆశయాలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాజనవేన సదయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి మునీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి ఇంద్రకరణ్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు అల్లం దేవేందర్, నాయకులు మాదాసి సతీష్, బంగారు రమేష్, రాణవేన శ్రీనివాస్, ఆషాడపు సురేష్, సబ్బని రాజమల్లు, కారుపాకల రమేష్, కల్వల శ్యామ్, అంకుస్, పాల రాజేశం, గరిగంటి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి : ఉమ్మడి రాష్ట్ర మాజీ స్పీకర్ దివంగత శ్రీపాదరావు వర్ధంతి కార్యక్రమాన్ని మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు వేరువేరుగా నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మానుమండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎండి అధిక్‌పాషా ఆధ్వర్యంలో శ్రీపాదరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి స్వీట్లు పంపిణీ చేసారు. అనంతరం శ్రీపాదరావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎండి పకీర్, అమరగాని లింగయ్యగౌడ్, ముమ్మాడి రవి, బొట్ల వెంకటేశం, జనుప తిరుపతి, పొట్యాల బీరయ్య, అమ రగాని సాయి, కైలాసం శ్రావన్, ఎండి సమీర్ పలువురు పాల్గొన్నారు.


రామగిరిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు


కేశనపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు


కాల్వశ్రీరాంపూర్ పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఐసీహెచ్ చైర్మన్ రాజగోపాలన్‌కు డాక్టరేట్



జ్యోతినగర్, ఏప్రిల్ 13: ఇండియన్ కాఫీ వర్కర్స్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలోని ఇండియన్ కాఫీ హౌజ్(ఐసీహెచ్) సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఒ.కె.రాజగోపాలన్‌కు బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్ లభించింది. ప్రముఖ అంతర్జాతీయ యూనివర్సిటీ ఐన్‌స్టీన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ రాజగోపాలన్‌కు డాక్టరేట్ పట్టాను అందజేసింది. వ్యాపార రంగంలో నైతికత, విలువలు, సమర్థత, ఉద్యోగుల సంక్షేమం తదితర అంశాలతో కూడిన నివేదికను యూనివర్సిటీకి సమర్పించిన రాజగోపాలన్‌కు డాక్టరేట్‌ను ప్రకటించారు. రామగుండం ఎన్టీపీసీలో ఇండస్ట్రియల్ క్యాంటీన్‌తో పాటు దేశ వ్యాప్తంగా ఎన్టీపీసీ ప్రాజెక్టులు, ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల్లో ఇండస్ట్రియల్ క్యాంటీన్లను ఐసీహెచ్ నిర్వహిస్తోంది. రాజగోపాలన్‌కు డాక్టరేట్ రావడం పట్ల ఎన్టీపీసీ ఐసీహెచ్ సీనియర్ మేనేజర్లు, కార్తికేయన్, ఎం.ఐ.బెన్ని, మేనేజర్లు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సుధాకర్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్13: పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఆడెపు సుధాకర్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కమర్తపు మురళి, మాచర్ల రాంచంద్రంలు ప్రకటించారు. నియామకపు పత్రాలు అందజేశారు. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీగా భూర్ల లక్ష్మీనారాయణ, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం,కార్యవర్గ సభ్యులుగా రాజమౌళిలను నియమించారు. ఈమేరకు నియామక ఉత్తర్వులు అంద జేశారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

కమాన్‌పూర్, ఏప్రిల్ 13: మండలంలోని గుండారం గ్రామపంచాయతీ పరిధిలోని రాజాపూర్‌లోని శ్రీభక్త ఆంజనేయస్వామి సహిత శివ పంచాయతన సహిత నవగ్రహ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర నిర్వహించారు. సుంకు రాంచందర్, బండి రోహిత్, సముద్రాల రాజేందర్ సహకారంతో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్త ముకుంద రాజన్న స్వామితో పాటు దేవాలయ ప్రతిష్ఠ కమిటి భక్తజన బృందం బోనాల మల్లయ్య, కొట్టె పెద్ద సత్యం, చిన్న సత్యం, గడ్డి రమేష్, చంద్రశేఖర్, కన్నూరి నగేష్, గెల్లు లింగయ్య పాల్గొన్నారు.

కంచి కామాక్షి కల్యాణ మహోత్సవం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 13: గోదావరిఖని జనగామ గ్రామంలో శనివారం కంచి కామాక్షి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సతీమణి మనాలీ ఠాకూర్ హాజరై కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గ ప్రజలను చల్లగా చూడాలని కోరినట్లు తెలిపారు. అనంతరం సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు.

'అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి'

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 13: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని దళిత పరివర్తన సేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఈదునూరి శంకర్ అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని శనివారం గోదావరిఖనిలోని శాఖ గ్రంథాలయంలో దళిత పరివర్తన సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆరజీ-1 ఎన్విరాన్‌మెంట్ లాబ్ టెక్నీషియన్ లతాసాగర్, నాయకులు అనిల్‌కుమార్, శనిగల శ్రీనివాస్, బచ్చల ప్రసాద్, ప్రదీప్‌కుమార్, చరణ్‌దీప్, కరణ్, శ్రీలక్ష్మి, సువర్ణ, ఉస్మా పాల్గొన్నారు.

'పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి'

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 13: తనను గెలిపిస్తే పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రొఫెసర్ డా.నతానియేలు అన్నారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని తెలిపారు. ఇప్పటివరకు స్థానికేతరులు పెద్దపల్లి ఎంపీలుగా గెలిచారని, నియోజకవర్గంపై పూర్తి స్థాయిలో అవగాహన, పట్టు లేకపోవడంతో అభివృద్ధి జరగలేదన్నారు. పాలిటెక్నిక్, మైనింగ్, పీజీ కళాశాలలు, విశ్వ విద్యాలయం లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసమావేశంలో కర్రె మహేందర్ రెడ్డి, జంగ మహేందర్ రెడ్డి, పల్లెల్ల వీరస్వామి, దొడ్డె బాపు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయోధ్య శ్రీరామ మహాయాగం


యాగంలో పాల్గొన్న భక్తులు

అంతర్గాం, ఏప్రిల్ 13: రామగుండం పట్టణంలోని 20వ డివిజన్ ఏరియాలోగల శ్రీ సాయినాథుని దేవాలయంలో 28వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ అయోధ్య శ్రీరామ మహాయాగాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన వేద పండితులు 108 మంది దంపతులతో శ్రీ అయోధ్య శ్రీ రామ మహాయాగాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, స్థానిక 20వ డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్, అర్చకులు గట్టు నరహరి శర్మవధాని, రాంపెల్లి శ్రీనివాస్ శర్మ, కమిటీ ప్రతినిధులు కలవేని మల్లేష్, కోరబోయిన సాంబయ్య, లక్ష్మణ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'బీపీ మండల్ సిఫార్సులు అమలు చేయాలి'

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 13: ప్రభుత్వానికి, గొర్రె కాపరులకు మధ్య వారధిలా బీపీ మండల్ సిఫార్సుల అమలు కోసమే గొర్రె కాపరుల సంక్షేమ సంఘం ఆవిర్భవించినట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ తెలిపారు. గొర్రె కాపరుల సంక్షేమ సంఘం ఆవిర్భావ దినోత్సవం, బీపీ మండల్ 42వ వర్ధంతిని పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు వేల్పుల నాగరాజు యాదవ్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మారం తిరుపతి యాదవ్ హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీమాన్‌తో కలిసి మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వేల్పుల నాగరాజు యాదవ్, మేకల నరసయ్య యాదవ్, అట్ల సాగర్ యాదవ్, ఆవుల రాజేష్, బత్తిని లక్ష్మణ్, తమ్మనవేని అంజి, కొమ్మ లచ్చయ్య, మల్లెత్తుల ఐలయ్య, కాల్వ కొమురయ్య, గంగనేని రఘు, కొమ్మ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

'చీకటిపువ్వు' నాటికకు ఉత్తమ ద్వితీయ బహుమతి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 13: ఈ నెల 9 నుంచి 11 వరకు రావులపాలెం (రాజమండ్రి) లో జరిగిన జాతీయ స్థాయి నాటిక పోటీల్లో కరీంనగర్ చైతన్య కళాభారతి కళాకారులు ప్రదర్శించిన 'చీకటిపువ్వు' నాటికకు ఉత్తమ ద్వితీయ బహుమతితో పాటు ఉత్తమ నటిగా లహరి బహుమతి పొందా రని సంస్థ అధ్యక్షుడు తిప్పర్తి ప్రభాకర్ తెలిపారు. బహుమ తులను సినీ నటుడు తనికెళ్ళ భరణి, సినీ దర్శకుడు వంశీ చేతుల మీదుగా కళాకారులు శనివారం అందుకున్నారు. నాటికలో కొత్తకొండ సత్యనారాయణ, దేవులపల్లి గిరిబాబు, యేపూరి శ్రీనివాస్ నటించగా సంగీతం సురభి నాగరాజు, ఆహార్యం, లైటింగ్ కేదారి నాగు చేశారని దర్శకుడు మంచాల రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులకు పలు కళా సంస్థల బాధ్యులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, కళాకారులు అభినందనలు తెలిపారు.

మాజీ సర్పంచ్ కాంగ్రెస్‌లో చేరిక

ముత్తారం, ఏప్రిల్13: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చెల్కల సుకుమార్ శనివారం బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 13: మండల కేంద్రంలో మెట్టు రాములు(35) ఇటీవల అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. 2005లో కాల్వ శ్రీరాంపూర్ ఉన్నత పాఠశాలలో మెట్టు రాములుతో కలిసి పదో తరగతి చదువుకున్న తోటి క్లాస్‌మేట్స్ మృతుని కుటుంబానికి శనివారం రూ.20వేల ఆర్థిక సహాయం అందించి తమ ఉదారత చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గోలి నరేష్, వడ్లూరి సాగర్, జనగామ అన్వేష్, కొంత మధుకర్, కలవల సందీప్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 13: రామగుండం కార్పొరేషన్ 38వ డివిజన్‌లోని ఇందిరానగర్-1 అంగన్‌వాడి కేంద్రంలో శనివారం ఉదయం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం టీచర్ జి.రజిత, ఆయా అరుణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతికి ఏర్పాట్లు

జూలపల్లి, ఏప్రిల్ 13 : మండల కేంద్రంతో పాటు వడ్కాపూర్, కాచాపూర్, కుమ్మరికుంట ఆయా గ్రామాల్లో భారత రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు దళిత, బీసీ, మైనారిటీ సంఘాల నాయకులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈమేరకు కొందరు దళిత,బీసీ,మైనార్టి యువనాయకులు శనివారం ఆయా గ్రామాల్లోగల అంబేద్కర్ విగ్రహాలకు రంగులు వేయడం, ఆ పరిసర ప్రాంతాను పరిశుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కలలను నిజం చేసేందుకు ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోయి గ్రామాల్లో పేరుకుపోయిన అసమానతలను దూరం చేసేందుకు కృషి చేస్తామని కొందరు యువకులు ప్రతిజ్ఞ చేస్తున్నారు.

'ఇంటర్మీడియట్ ఫీజులను నియంత్రించాలి'

గణేశ్‌నగర్, ఏప్రిల్13: ఇంటర్మీడియట్ ఫీజులను ప్రభుత్వం నియంత్రించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసి పెద్ది శ్రీధర్‌రాజు కోరారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలలు విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంటర్మీడియట్ ఫీజులను నియంత్రించి ప్రభుత్వమే నిర్ణయించి అట్టి ఫీజులను బిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ రూపంలో అందజేస్తు న్నార న్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఇంజనీరింగ్ ఫార్మసీ మెడికల్ లాంటి వృత్తి విద్యా కోర్సులను పెరిగిన ధర కనుగుణంగా ప్రభుత్వమే ఫీజులు నిర్ణయించి దాని ప్రకారమే ఫీజులు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తుం దన్నారు. కానీ ఇంటర్ విద్యార్థుల సంబంధించి ఫీజులు నిర్ణయం గత 20 సంవత్సరాల క్రితం నిర్ణయించిన ఫీజులు ప్రభుత్వం వెంటనే ఫీజులను నియంత్రించి నిర్ణయించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

శ్రీపాదరావును ఆదర్శంగా తీసుకోవాలి

రామగిరి, ఏప్రిల్ 13: దివంగత నేత దుద్దిళ్ళ శ్రీపాదరావును నేటి తరం నాయకులు ఆదర్శంగా తీసుకొవాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మోల్మామూరిశ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీపాదరావు మరణం రాష్ట్రానికి తీరని లోటుగా పేర్కోన్నారు. మంథని ప్రాంత అభివృద్ధి విషయంలో శ్రీపాదరావును ఆదర్శంగా తీసుకుంటు ప్రతి ఒక్క నాయకుడు ముందుకు వెళ్లాలని సూచించారు. శ్రీపాదరావు మరణం ఎవరు పూడ్చలేరని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు తీగల శ్రీధర్, మెరుగు శ్రీకాంత్, శంకర్, రాజు తదితరులు పాల్గోన్నారు.

రేపు ఉచిత కంటి ఆపరేషన్లు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 13: పెద్దపల్లి లయన్స్ క్లబ్ విజన్ కేర్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆసుపత్రి వారి సహకారంతో సోమవారం ఉచిత కంటి ఆపరేషను నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ పూదరి దత్తాగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 సంవత్సరాలు పైబడిన కళ్లు కనిపించని వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని, వారికి ఉచిత రవాణా, భోజన సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఆపరేషన్ చేసుకొనే వారు ఆధార్ కార్డ్ తెల్లరేషన్‌కార్డ్ జిరాక్స్‌లతో పాటు 220 రూపాయలు, చెద్దరు, ప్లేట్, గ్లాస్ వెంట తెచ్చుకోవాలని కోరారు. వివరాలకు పెద్దపల్లిలోని సిటీ కేబుల్ కార్యాలయం ఎదురుగా లయన్స్ విజన్ సెంటర్/సవేరా ఆప్టికల్స్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యాసంస్థల్లో వేడుకల హంగామా


గ్యాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులతో నరేందర్‌రెడ్డి


మంథని కృష్ణవేణిలో..

సుల్తానాబాద్, ఏప్రిల్ 13: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు అల్ఫోర్స్ స్కూల్స్ చక్కటి పునాదులు వేస్తున్నాయని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి సుల్తానాబాద్‌లోని ఆల్ఫోర్స్ స్కూల్‌లో కార్డియల్ గ్యాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యదశ జీవితంలో మధురమైన జ్ఞాపకాలను మిగులుస్తుందన్నారు. పాఠశాలలో యూకేజీ పూర్తి చేసుకుని ప్రైమరీస్కూల్‌లో అడుగు పెడుతున్న విద్యార్థులకు పట్టాలను అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని పట్టాలు స్వీకరించి ఉన్నత స్థానంలో నిలువాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపద్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కృష్ణవేణిలో స్పోర్ట్స్ అండ్ కల్చర్ మీట్..

మంథని, ఏప్రిల్ 13: స్థానిక కృష్ణవేణి హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించిన గ్రాడ్యూ వేషన్ స్పోర్ట్స్ అండ్ కల్చర్ మీట్ శనివారం అందరిని అలరించింది. పాఠశాల అవరణలో కిండర్ గార్టెన్ విద్యార్థులకు కన్వోకేషన్ పట్టాలు అందజేసి అభినందించారు. అలాగే పలు ఆటల పోటీలలో గెలుపొందిన వారికి, ఐఐటి, నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలాతో అలరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు ఎడ్ల శ్రీనివాస్, జాఫర్, సుదర్శన్‌రెడ్డిలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాద్యాయులు పాల్గొన్నారు.

ఆపిల్ కిడ్స్‌లో వార్షికోత్సవం

కమాన్‌పూర్, ఏప్రిల్ 13 : మండల కేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాల పదో వార్షికోత్సవ వేడుకలు శనివారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యూకేజి విద్యార్థుల గ్రాడ్యూయేషన్‌ను డేను నిర్వహించారు. ఈ వేడుకలకు ట్రస్మా జిల్లా అధ్యక్షుడు అబ్బ కేశవరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి మెరుగైన విద్యను అందిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులకు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలన్నారు. సృజనాత్మక క్రీడల వైపు విద్యార్థుల దృష్టి మళ్లించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఓదెలు యాదవ్, కరుణాకర్‌రావు, పాఠశాల ప్రిన్సిపాల్ రాజమణి, భూలక్ష్మి, సుమలత, శారద,గౌతమి, పద్మ, బుతువ్వ ఉన్నారు.

ఆకట్టుకున్న గ్రాడ్యుయేషన్ డే

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 13: గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌లోని ఆపిల్‌కిడ్స్ స్కూల్‌లో శనివారం జరిగిన చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సతీమణి మనాలీఠాకూర్ హాజరై విద్యార్థులకు సర్టిఫికేట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సునీత, ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.


ఆపిల్ కిడ్స్ విద్యార్థుల నృత్యాలు